# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 14-09-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- బ్రిక్స్ సదస్సులో ప్రముఖ ఆర్థిక వ్యవస్థలను ఒకే వేదికపైకి తీసుకురావడం భారత్ సామర్థ్యానికి నిదర్శనమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు.
- మరికొద్దిసేపట్లో తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరుగనుంది.
- ఆధ్యాత్మిక ఆంధ్రప్రదేశ్ సాధనకు కృషి చేస్తున్నామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు.
- ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో ఉత్తర కోస్తా ఆంధ్రలో రేపు, ఎల్లుండి తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురుస్తాయని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది.

====================

రాష్ట్రవ్యాప్తంగా వినాయక చవితి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇళ్లలోను, మండపాలలోనూ మట్టితో చేసిన వినాయక ప్రతిమలను ప్రతిష్టించి భక్తులు పూజలు చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా రాష్ట్రంలో పలుచోట్ల భారీ మట్టి విగ్రహాలను ప్రతిష్టించారు. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసే గణేష్ మండపాలకు విద్యుత్ ను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది.

====================

ఢిల్లీ వేదికగా 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సును భారత్ విజయవంతంగా నిర్వహించడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా కీలక మార్పులు చోటుచేసుకుంటున్న సమయంలో ప్రముఖ ఆర్థిక వ్యవస్థలను ఒకే వేదిక పైకి తీసుకురావడం భారత్ సామర్థ్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమంలో ఆయన పోస్ట్ చేశారు. అంతర్జాతీయ వేదికపై బ్రిక్స్ దేశాల మధ్య ఏకాభిప్రాయాన్ని తీసుకురావడం.. పెరుగుతున్న భారత్ ఆర్థిక శక్తి, ప్రాధాన్యతకు నిదర్శనమని చంద్రబాబునాయుడు అన్నారు. ఈ చారిత్రాత్మక సదస్సును విజయవంతంగా నిర్వహించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీకి అభినందనలు తెలిపారు. బ్రిక్స్ సదస్సు విజయవంతంగా ముగియడం భారత్‌కు గర్వకారణమని ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొన్నారు. ప్రపంచ జనాభాలో దాదాపు 50 శాతం, ప్రపంచ జీడీపీలో 40 శాతం వాటా కలిగిన బ్రిక్స్ కూటమికి ప్రపంచ ఆర్థిక, భౌగోళిక రాజకీయాలను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర ఉందన్నారు.

====================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రజలతో పాటు తెలుగు ప్రజలందరికీ విఘ్నేశ్వరుని ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. వినాయక చవితి సందర్భంగా గుంటూరు జిల్లా ఉండవల్లిలోని నివాసంలో విఘ్నేశ్వరుడికి ముఖ్యమంత్రి ఈరోజు పూజలు నిర్వహించారు. విఘ్నాలను తొలగించి, సన్మార్గాన్ని చూపే చవితి వేడుకలు మనకు సామాజిక స్పృహను, ఐక్యతను నేర్పించడంతో పాటు,

సమష్టితత్వాన్ని బోధిస్తాయని తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి ఎదురయ్యే విఘ్నాలన్నీ తొలగి.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సుభిక్షంగా, ఆనందంగా ఉండాలని గణనాథుడిని ప్రార్థించినట్లు చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

====================
విరామం
====================

కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రభుత్వం తరఫున రాష్ట్ర దేవదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కాణిపాకంలో ఈరోజు నుండి వచ్చే నెల 4వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా 6 వేల 254 ఆలయాల్లో ధూప, దీప, నైవేద్య పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఆలయాల అభివృద్ధి, పునర్నిర్మాణానికి కామన్ గుడ్ ఫండ్ ద్వారా 767 ఆలయాలకు 908 కోట్ల రూపాయలు మంజూరు చేసినట్లు చెప్పారు. ఆధ్యాత్మిక ఆంధ్రప్రదేశ్ సాధనకు కృషి చేస్తున్నామని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్...28 సెకన్లు)

====================

తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు ఈరోజు రాత్రికి అంకురార్పణ జరుగనుంది. అంకురార్పణలో భాగంగా శ్రీవారి సేనాధిపతి ఉత్సవాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడి) నిర్వహించనుంది. రేపు సాయంత్రం ధ్వజారోహణం నిర్వహిస్తారు. ధ్వజారోహణం అనంతరం రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రీవారికి పట్టు వస్త్రాలను సమర్పించనున్నారు. తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు పెరిగే అవకాశం వుండటంతో రేపటి నుంచి ఈ నెల 20వ తేదీ వరకు సర్వ దర్శనం, దివ్య దర్శనం టోకెన్ల జారీ నిలిపివేస్తున్నట్లు టిటిడీ ఈరోజు ఒక ప్రకటనలో తెలిపింది. తిరుపతిలోని భూదేవి కాంప్లెక్స్, శ్రీనివాసం, విష్ణు నివాసంలో టోకెన్లు జారీ చేయరని.. సెప్టెంబర్ 21న దర్శనానికి సంబంధించిన టోకెన్లు సెప్టెంబర్ 20న జారీ చేస్తామని టిటిడి ఆ ప్రకటనలో పేర్కొంది.

====================

మెక్సికోలోని సాల్టిల్లోలో జరిగిన ఆర్చరీ ప్రపంచ కప్ ఫైనల్-2026లో విజయం సాధించిన ధీరజ్ బొమ్మదేవరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ అభినందనలు తెలిపారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం వేదికగా వారు పోస్టు పెట్టారు. విజయవాడ ఆర్చరీ గ్రౌండ్స్ నుంచి మెక్సికోలోని ప్రపంచ వేదిక వరకు ధీరజ్ ప్రస్థానం సాగిందని ముఖ్యమంత్రి అభినందించారు. ఉత్కంఠభరితమైన షూట్-ఆఫ్‌లో జపాన్‌కు చెందిన జున్యా నకానిషిని ఓడించి, పురుషుల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో స్వర్ణం సాధించారని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రశంసించారు. మహిళల ఆసియా కప్-2026ను గెలుచుకున్న భారత మహిళల క్రికెట్ జట్టుకు ఉప ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు. ఈ విజయం భారత క్రికెట్‌కు మరో గర్వకారణమని పేర్కొన్నారు.

====================

వాయువ్య బంగాళాఖాతంలో నెలకొన్న ఉపరితల ఆవర్తనం ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాల మీదుగా విస్తరించి ఉందని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ద్రోణి దక్షిణ అంతర్గత కర్ణాటక నుండి తమిళనాడు మీదుగా నైరుతి బంగాళాఖాతంలో విస్తరించి ఉందని అమరావతిలోని వాతావరణ కేంద్రం అధికారి ఎం. వెంకట్రావు పేర్కొన్నారు. వీటి ఫలితంగా ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్ లో రేపు, ఎల్లుండి తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని వివరించారు. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముందని ఎం. వెంకట్రావు పేర్కొన్నారు.

====================

శ్రీశైలంలో గణపతి నవరాత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ తొమ్మిది రోజులపాటు ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా యాగశాల ప్రవేశం, మహాగణపతి పూజ, అఖండదీప స్థాపన వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. దేశంలో శాంతి, సౌభాగ్యాలు నెలకొనాలని, సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో జీవించాలని ప్రత్యేక సంకల్పం చేశారు.

====================
====================